## క్లుప్తంగా

### సజ్జల రామకృష్ణారెడ్డికి కాకుమాను రాజశేఖర్ కృతజ్ఞతలు



సజ్జలను సన్మానిస్తున్న కాకుమాను రాజశేఖర్

**ఒంగోలు సిటీ:** తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షునిగా నియమితులైన కాకుమాను రాజశేఖర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సజ్జలను సత్కరించారు. తనను పదవిలో నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట బీసీ నాయకుడు బొట్ల రామారావు ఉన్నారు.

### 14న రఘునాయక స్వామి కల్యాణం

**నాగులుప్పలపాడు:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చదలవాడ రఘునాయకస్వామి కల్యాణోత్సవం ఈ నెల 14వ తేదీన ఉదయం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అనీల్ తెలిపారు. రఘునాయక స్వామి కల్యాణోత్సవంలో భాగంగా ఈ నెల 7వ తేదీ నుంచి అంకురార్పణ, 8వ తేదీ ధ్వజారోహణం, 14వ తేదీ ఉదయం గరుడ ప్రదక్షిణ అనంతరం స్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు రథోత్సవం కనులపండువగా సాగుతుందని ఈఓ పేర్కొన్నారు.

### కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండ



కోటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చుండూరి రవి

**నాగులుప్పలపాడు:** వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జి చుండూరి రవిబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, జేసీఎస్ జిల్లా మాజీ కన్వీనర్ పాలడుగు రాజీవ్ పెదనాన్న పెద్ద కర్మ కార్యక్రమానికి బుధవారం నాగులుప్పలపాడు మండలానికి వచ్చిన చుండూరి రవిబాబు.. పార్టీ నాయకులతో కలిసి కోటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర నాయకుడు నలమలపు కృష్ణారెడ్డి, మేధావుల ఫోరం స్టేట్ సెక్రటరీ కంచర్ల సుధాకర్, సర్పంచ్‌లు ఘట్టమనేని అశోక్, పాలేరు నాగేశ్వరరావు, నాయకులు తగిరస సుబ్బారావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### రీ సర్వేపై అవగాహన ర్యాలీ



మల్లవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ సుజన్ కుమార్, రైతులు

**మద్దిపాడు:** మండలంలోని మల్లవరం, అన్నంగి గ్రామాల్లో భూముల రీ సర్వే ప్రారంభించనున్న నేపథ్యంలో గ్రామ ప్రజలకు రీ సర్వేపై అవగాహన కల్పిస్తూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల రైతులతో కలిసి తహసీల్దార్ సుజన్ కుమార్ ర్యాలీ నిర్వహించి పలు సమస్యలపై చర్చించారు. ఆయన వెంట రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎండీ రఫీ, వీఆర్వో దీపక్, గ్రామ సర్పంచులు నారా సుబ్బారెడ్డి, లోకేశ్వరి, రెవెన్యూ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

### ఉడ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి

**పొదిలి:** స్థానికంగా ఉడ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయటం ద్వారా ఎక్కువ మందికి ఉపాధి మెరుగుపర్చుకునే సౌకర్యం కలుగుతుందని విశ్వబ్రాహ్మణుల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసచారి అన్నారు. స్థానిక కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచర్ల శేఖర వర్క్‌షాపు వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంప్లెక్స్ ఏర్పాటుతో పాటు రాయితీతో విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ఉడ్ కాంప్లెక్స్ ప్రాధాన్యత గురించి వివరించారు. విశ్వబ్రాహ్మణ ఫైనాన్స్ ఏర్పాటు చేసి, సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన చేతి వృత్తిదారులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఫణిదపు సుధాకర్, యూత్ అధ్యక్షుడు తోపాటి జనార్ధనాచారి, రాష్ట్ర నాయకులు పొన్నపల్లి బ్రహ్మానందం, రాచర్ల రాజశేఖర్, ఉప్పుటూరి నారాయణస్వామి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రైతుకు పెద్ద కష్టం

- కొనుగోళ్లలో ఐటీసీ ఒంటెద్దు పోకడ
- కేజీ పొగాకు ధరను రూ.280 నుంచి రూ.235కు తగ్గించిన వైనం
- నష్టాలొచ్చి అప్పులపాలవుతామన్న ఆందోళనలు రైతులు
- ఈ ఏడాది అదనంగా పొగాకు సాగు
- రైతులను ఆదుకోవడానికి ప్రయత్నించని కూటమి ప్రభుత్వం



వెల్లంపల్లి పొగాకు బోర్డులో వేలానికి సిద్ధంగా ఉన్న పొగాకు బేళ్లు

**మద్దిపాడు:** పొగాకు మార్కెట్‌లో పెద్దన్నగా వ్యవహరించే ఐటీసీ కంపెనీ ఒంటెద్దు పోకడతో ఈ ఏడాది తమకు నష్టాలొచ్చి అప్పులు మిగులుతాయని పలువురు పొగాకు రైతులు ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం మొత్తం మీద కేజీ పొగాకు సరాసరి ధర రూ.279.50 దక్కింది. ఈ ఏడాది వేలం ప్రారంభానికి ముందు పొగాకు కంపెనీలు రూ.260తో ప్రారంభించాలని సూత్రప్రాయంగా ఇండియన్ టుబాకో అసోసియేషన్‌లో మాట్లాడుకున్నారు. వారి అభిప్రాయాలను కాదని ఐటీసీ 280 రూపాయలకు పెంచింది. దీంతో చిన్న కంపెనీల వారు రాలేకపోయారు. కానీ, 280 రూపాయలుగా నిర్ణయించిన ధరను ఐటీసీ వారు గత ఐదు రోజులుగా పూర్తిగా దిగ్గోసి 235 రూపాయలకు కేజీ పొగాకు కొనుగోలు చేస్తున్నారు. వారిని కాదని కొనుగోలు చేసే ధైర్యం లేక మిగిలిన కంపెనీల వారు మిన్నకుండిపోయారు. పైకి రైతులకు మేలు చేస్తున్నామని ఐటీసీ చెబుతున్నప్పటికీ.. ఉద్దేశపూర్వకంగా ధర తగ్గించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్ లక్షణాలు ఎక్కడికి పోతాయంటూ పలువురు పొగాకు రైతులు విమర్శిస్తున్నారు.

**చిన్న కంపెనీలు వచ్చినా రూ.260 దక్కేది...**

ఐటీసీ ఒంటెద్దు పోకడ పోకుండా కనీసం చిన్నకంపెనీల వారు వచ్చినా కేజీ పొగాకుకు రూ.250 నుంచి రూ.260 వరకు దక్కుదని, తమ పొగాకు బేళ్లు అమ్ముడయ్యేవని రైతులు అంటున్నారు. పొగాకు పండించే బ్రెజిల్, జింబాబ్వే, టాంజానియా, చైనా వంటి దేశాలు ఈ సంవత్సరం అంతర్జాతీయ మార్కెట్‌లోకి వస్తున్నాయని, అందువలన విదేశీ ఆర్డర్లు రాలేదని రకరకాల సాకులు చూపుతూ రైతుల కడుపు కొట్టే ఆలోచనలో కార్పొరేట్ కంపెనీలు ఉన్నాయంటూ పొగాకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకలో ఎక్స్‌పోర్టు క్వాలిటీ పొగాకు 100 మిలియన్లను బోర్డు ఆర్డర్ చేస్తే కేవలం 89 మిలియన్ కేజీల పొగాకు మాత్రమే వచ్చింది. వారికి 360 రూపాయలకుపైగా ధర చెల్లించి పొగాకు కొనుగోలు చేశారు. ఆంధ్రాలో మాత్రం 280 రూపాయల రేటు నిర్ణయించినప్పటికీ 235 రూపాయలకే కొనుగోలు చేయడంపై పొగాకు రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం తమకు నష్టాలు తప్పవని పలువురు రైతులు వాపోతున్నారు.

**కౌలు రైతులకు బ్యారన్‌కు రూ.4 లక్షల వరకూ నష్టం వాటిల్లే అవకాశం...**

కౌలు రైతులకు బ్యారన్‌కు రూ.4 లక్షల వరకూ నష్టం వాటిల్లే అవకాశం ఉందని పొగాకు రైతులు తెలిపారు. నల్లరేగడి నేలల్లో బ్యారన్‌కు సుమారు 41 క్వింటాళ్లు, తేలిక నేలల్లో 44 క్వింటాళ్ల పొగాకు అమ్ముకోవచ్చని ఆంధ్రాలో 162 మిలియన్ కేజీల పొగాకు సాగుకు బోర్డు అనుమతిచ్చింది. పొగాకు రైతులు ఈ సంవత్సరం అదనంగా పండించడంతో 200 మిలియన్ కేజీల వరకూ పొగాకు దిగుబడి అవుతుందని బోర్డు అంచనా వేసింది. ఈ నేపథ్యంలో గత మూడు సంవత్సరాలుగా పొగాకుకు ఉన్న ధరలు చూసి పలువురు కౌలు రైతులు పొగాకు పంట వేశారు. గత మూడు సంవత్సరాల ధరలతో పోల్చుతూ కూలీల రేట్లు కూడా పెరిగిపోవడంతో ఈ సంవత్సరం సరాసరి ధర 320 రూపాయలు వస్తేనే రైతులు అప్పులు లేకుండా బయటపడే అవకాశం ఉంది. కనీసం 300 రూపాయల సరాసరి ధర వచ్చినా శ్రమను మాత్రమే నష్టపోతామని, అప్పుల పాలు కాకుండా ఉంటామని రైతులు అంటున్నారు.

**పట్టించుకోని కూటమి సర్కారు...**

వ్యవసాయమే దండగన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ప్రస్తుతం తమకు సహాయం చేసే పరిస్థితి కనిపించడం లేదని పొగాకు రైతులు అంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ వ్యాపారులను కట్టడి చేయడానికి పొగాకుకు మద్దతు ధర కల్పించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించారు. దీంతో కార్పొరేట్ వ్యాపారుల పప్పులు ఉడకలేదు. ఆ తర్వాత గత మూడు సంవత్సరాలుగా మార్కెట్‌లో ఆరోగ్యకరమైన పోటీ నెలకొని రైతులకు పొగాకు పంట లాభాలు కురిపించింది. ప్రస్తుత కూటమి సర్కారు పొగాకు రైతులకు మేలు చేసే దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడంతో రైతుల ఆశలన్నీ ఆవిరైపోతున్నాయి.

### పంచాయతీ కార్యదర్శిపై విచారణ



పంచాయతీ కార్యదర్శిని విచారిస్తున్న అధికారులు

**నాగులుప్పలపాడు:**

మండలంలోని ఉప్పుగుండూరు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మెండెం కిరణ్‌కుమార్‌పై పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. పాలకుల ప్రమేయం లేకుండా నిధులను దారి మళ్లించారని ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో ఉప్పుగుండూరు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బుధవారం ఈవోపీఆర్డీ మురళీమోహన్ ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వయంగా విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శితో పాటు అతనిపై ఫిర్యాదు చేసిన వారిని విడివిడిగా స్వయంగా విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. చాలా మంది గ్రామస్తులు తమ వద్ద నుంచి లంచాల రూపంలో, అధిక పన్నుల రూపంలో పంచాయతీ కార్యదర్శి డబ్బు వసూలు చేసినట్లు లిఖిత పూర్వకంగా వాంగ్మూలం అందజేసినట్లు సమాచారం. విచారణపై ఈవోపీఆర్డీ మురళీమోహన్ మాట్లాడుతూ పూర్తి స్థాయి విచారణ ఇంకా పూర్తి కాలేదని, అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని తెలిపారు. పూర్తి విచారణ అనంతరం రిపోర్టును జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు.

## రైతులకు అందుబాటులో ఉండాలి

- సిబ్బందితో ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకుడు రమేష్‌బాబు



వ్యవసాయ సిబ్బందితో మాట్లాడుతున్న సహాయ వ్యవసాయ సంచాలకుడు రమేష్‌బాబు

**సంతనూతలపాడు:** గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకుడు బి.రమేష్‌బాబు ఆదేశించారు. సంతనూతలపాడులోని అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో గల ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల వ్యవసాయ సిబ్బందితో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ రైతుల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ముందుగా భూ యజమానులు, భూ రికార్డులు సరిగ్గా ఉన్న రైతులను గుర్తించాలని సూచించారు. ఇనాం భూములు, డీకే పట్టా కలిగిన వారికి కూడా వెంటనే రైతు వారీ రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని తెలిపారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఈకేవైసీ, రైతు స్వతహాగా చేసుకున్న రిజిస్ట్రేషన్లను కూడా పరిశీలించాలని తెలిపారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు ఎంత అవసరమనే విషయంపై గ్రామ వ్యవసాయ సహాయకులతో చర్చించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల వ్యవసాయాధికారులు పి.పావని, డి.వి.భాస్కర్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.వెంకటరావు, కె.వి.సుబ్బారెడ్డి, పి.వెంకటేశ్వర్లు, జి.శివజ్యోతి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

### అంకమ్మరావుకు సన్మానం

**ఒంగోలు వన్‌టౌన్:** రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం అందుకున్న కళామిత్రమండలి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావును కాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. కాపు సంఘ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక రామనగర్ 1వ లైన్‌లోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అంకమ్మరావుతో పాటు పలువురిని సత్కరించారు. సీవీఎన్ రీడింగ్ రూం క్లబ్ అధ్యక్షునిగా ఎన్నికైన ఈదుపల్లి గురునాథరావు, కోశాధికారి ఆరిగ వీరప్రతాప్, తోట సాయినవీన్, జల్లిపల్లి పూర్ణచంద్రరావు, తోట శ్రీధర్‌ను సత్కరించారు. కార్యక్రమానికి కాపు సంఘ అధ్యక్షుడు కొక్కిరాల సంజీవ్‌కుమార్ అధ్యక్షత వహించగా, బండారు సుబ్బారావు, అయినాబత్తిన ఘనశ్యాం, వర్థు శేషయ్య, పసుపులేటి శ్రీనివాసరావు, కొల్లా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### వక్ఫ్ బిల్లుకు కూటమి మద్దతు దుర్మార్గం

**సంతనూతలపాడు:** ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను హరించడానికి కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతివ్వడం దారుణమని కాంగ్రెస్ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ పాలపర్తి విజేష్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ముస్లింల హక్కులను కించపరుస్తూ వాటిని కాలరాసేందుకు కుయుక్తులు పన్నడం బట్టబయలైందన్నారు. రాజ్యాంగం ముస్లింలకు కల్పించిన హక్కులను కాలరాసేందుకే మోదీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టిందని వాపోయారు. మైనార్టీల మనోభావాలను దెబ్బతీయడమే మోదీ అజెండా అన్నారు. ఇటువంటి బిల్లుకు రాష్ట్రంలోని కూటమి పార్టీలు మద్దతు తెలపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్యులర్ ముసుగులో ముస్లింలను టీడీపీ మోసం చేస్తోందని వాపోయారు. ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ముస్లింల హక్కులు కాపాడేందుకు, వారి రక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా నడుం బిగిస్తుందన్నారు. వక్ఫ్ భూముల పరిరక్షణ, ముస్లిం హక్కుల కోసం ఉద్యమించనున్నట్లు తెలిపారు.

## ఒంగోలు బార్ అసోసియేషన్‌కు 16 నామినేషన్లు



అధ్యక్ష స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న బొడ్డు భాస్కరరావు



కోశాధికారి స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న కాటుకూరి సంపత్‌కుమార్

**ఒంగోలు:** ఒంగోలు బార్ అసోసియేషన్‌కు బుధవారం 16 మంది నామినేషన్లు దాఖలు చేశారు. స్థానిక జిల్లా కోర్టు భవనాల సముదాయం ఆవరణలోని ఒంగోలు బార్ అసోసియేషన్ లైబ్రరీ హాలులో ఎన్నికల అధికారి శ్రీనివాసగుప్తా నామినేషన్లు స్వీకరించారు. మొత్తం 8 పోస్టులు ఉండగా, 7 పోస్టులకు మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో ఆరు నామినేషన్లు అధ్యక్ష స్థానానికి, రెండు ఉపాధ్యక్ష స్థానానికి, మహిళా ప్రతినిధికి ఇద్దరు, ప్రధాన కార్యదర్శికి ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. ఇక, సంయుక్త కార్యదర్శి, గ్రంథాలయ కార్యదర్శి, కోశాధికారి స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలవగా, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ స్థానానికి ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగియడంతో గురువారం నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం ఎవరెవరు బరిలో ఉన్నారనేది స్పష్టం కానుంది. ప్రస్తుతం సంయుక్త కార్యదర్శి, గ్రంథాలయ కార్యదర్శి, కోశాధికారి స్థానాలకు ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో నామినేషన్ల పరిశీలన అనంతరం గురువారం సాయంత్రం ఈ మూడు స్థానాలకు అభ్యర్థులు ఖరారు కావడం నామమాత్ర ప్రక్రియగా మారనుంది.

**అధ్యక్ష స్థానానికి నామినేషన్లు దాఖలు చేసినవారు...**

బొడ్డు భాస్కరరావు, చావలి రమేష్‌బాబు, గోకనకొండ శ్రీనివాసరావు, నాయుడు ఈశ్వరరావు, పీఎస్‌వీ సత్యన్నారాయణరెడ్డి, వేల్పుల తిరుమల కృష్ణయాదవ్.

**ఉపాధ్యక్ష స్థానానికి నామినేషన్లు దాఖలు చేసిన వారు** : చుండూరి కృష్ణమూర్తి, మోటుమారి బలరాం

**మహిళా ప్రతినిధి** : తోట రాగ సుధారాణి, ముద్ద హెలీనా దీపాలత

**ప్రధాన కార్యదర్శి** : కాకర్ల ఆదిలక్ష్మి, నాగిశెట్టి సాంబశివరావు, సలగల జగజ్జీవన్‌రావు

**సంయుక్త కార్యదర్శి** : వేల్పూరి గ్రేస్‌కుమారి

**గ్రంథాలయ కార్యదర్శి** : గంటా శ్రీనివాసరావు

**కోశాధికారి:** కాటుకూరి సంపత్‌కుమార్

## స్పందన అర్జీతో స్పందించిన మైనింగ్ అధికారులు



కొలతలు తీయిస్తున్న మైనింగ్ ఏడీ రవివర్మతో పల్లామల్లి గ్రామస్తులు

**చీమకుర్తి రూరల్:** అక్రమ గ్రావెల్ తవ్వకాలపై స్పందనలో పల్లామల్లి గ్రామస్తులు ఇచ్చిన అర్జీపై ఎట్టకేలకు మైనింగ్ అధికారులు స్పందించారు. మండల పరిధిలోని పల్లామల్లి గ్రామ సర్వే నంబరు 33/2లో విజయవాడ నుంచి బెంగళూరుకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే కన్‌స్ట్రక్షన్ సంస్థ గ్రావెల్ తవ్వకాలు జరిపి తరలిస్తోంది. దీనిపై గతంలో స్పందనలో స్థానికులు అర్జీ ఇవ్వగా సంబంధిత అధికారులు సమస్యకు పరిష్కారం చూపలేదు. కానీ, సమస్య పరిష్కారం అయినట్లు అర్జీదారుడికి మెసేజ్ వచ్చింది. దీంతో గతంలో స్పందనలో ఇచ్చిన అర్జీని మళ్లీ రీ ఓపెన్ చేయించగా, స్పందించిన మైనింగ్ అధికారులు బుధవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మైనింగ్ ఏడీ రవివర్మ గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి కొలతలు తీయించారు. అక్రమ తవ్వకాలు జరిగితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారని అర్జీదారుడు బెల్లంకొండ శ్రీనివాస్ తెలిపారు.

## అనారోగ్యం కారణంగా వృద్ధుడు ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న రామకోటయ్య

**మద్దిపాడు:** అనారోగ్యం కారణంగా ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సీతారాంపురం కొష్టాల సెంటర్‌లో జరిగింది. స్థానికంగా నివాసం ఉంటున్న రామకోటయ్య స్వగ్రామం నేలటూరు కాగా, 40 ఏళ్లుగా సీతారాంపురం కొష్టాల సెంటర్లో ఇటుక బట్టీల్లో పనిచేస్తూ ఇక్కడే కుమారుని వద్ద ఉంటున్నాడు. బుధవారం ఉదయం పొలం కౌలు తీసుకుని వస్తానని చెప్పి నేలటూరు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. నేలటూరు గ్రామానికి చెందిన బంధువులు, గ్రామస్తులను ఆరా తీయగా, అక్కడి ఊర చెరువులో రామకోటయ్య మృతదేహం తేలియాడుతున్నట్లు చూశామని వారు చెప్పినట్లు మృతుడి కుమారుడు మద్దిపాడు పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. ఆ మేరకు మద్దిపాడు ఎస్‌ఐ శివరామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్



పరీక్షకు హాజరైన విద్యార్థుల హాల్‌టికెట్లు, గుర్తింపు కార్డులు తనిఖీ చేస్తున్న సిబ్బంది



చివరి నిముషంలో పరీక్ష కేంద్రంలోకి పరిగెడుతున్న విద్యార్థులు

జేఈఈ మెయిన్స్ పరీక్ష బుధవారం మొదటిరోజు జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఒంగోలులోని పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రుల హడావిడి కనిపించింది. కొందరు విద్యార్థులు ఆలస్యంగా వచ్చి ఆందోళనకు గురయ్యారు. అధికారులు, సిబ్బంది పక్కాగా పరీక్ష నిర్వహించగా, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

\- సాక్షి, ఒంగోలు



పరీక్ష కేంద్రం వద్ద తల్లితో విద్యార్థిని

### మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

**ఒంగోలు వన్‌టౌన్:** మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఒంగోలు రూడ్‌సెట్ సంస్థ డైరక్టర్ పీ శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణను ఏప్రిల్ 11 నుంచి 30 రోజుల పాటు అందించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల వారై ఉండాలన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి కల్పిస్తారని చెప్పారు. ఇతర పూర్తి వివరాలకు 8309915577 అనే నంబరుపై సంప్రదించాలన్నారు.

### ప్రాంగణ ఎంపికల్లో ఎస్ఎస్ఎన్ విద్యార్థులకు ఉద్యోగాలు

**ఒంగోలు సిటీ:** స్థానిక మంగమూరు రోడ్డులోని ఎస్.ఎస్.ఎన్ డిగ్రీ కాలేజీలో గ్లోబల్ వన్ సర్వీసెస్ కంపెనీ వారు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 14 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు కాలేజీ చైర్మన్ యల్లటూరి రామకృష్ణారెడ్డి తెలిపారు. సంవత్సరానికి రూ.1.8 లక్షల నుంచి 2.4 లక్షల ప్యాకేజీకి ఎంపికైనట్లు చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ వై.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరంలో ఇప్పటివరకు తమ విద్యార్థులు మొత్తం 87 మంది ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సునీల్ కుమార్, అనిల్ కుమార్, సుభాని, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ టి.రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ఎస్ఎస్ఎన్ కళాశాల యాజమాన్యం

### చిన్నారులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

**సంతనూతలపాడు:** సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు భోజనం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. దాత ముల్లూరి గంగాప్రసాద్ అందించగా, ఎస్సై అజయ్‌బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంతనూతలపాడులోని 9 అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు 130 మందికి వాటిని అందించారు.